సాక్షి నిజామాబాద్

సోమవారం । 26 । ఆగస్టు । 2024



పనిచేయని నిఘానేత్రాలు
రెంజల్ మండలంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది.
- 8లో ▸



మాయమైన నవ్వులు
యాసంగిలో సాగు చేసిన నువ్వులకు ఎక్కువ ధర వస్తుందని నిల్వ చేసిన రైతులకు నిరాశే మిగిలింది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం 28.1 /21.9

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అడపాదడపా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 100 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 542 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091 (80 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1083.30 (54.62 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

సెలవుల్లో ఎస్ఈ రవీందర్

సుభాష్‌నగర్ : ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ వ్యక్తిగత సెలవులో వెళ్లారు. అనారోగ్య కారణాలతో సెప్టెంబర్ 8వ తేదీ వరకు ఆయన సెలవులో ఉండనున్నారు. కామారెడ్డి ఎస్ఈ రమేశ్‌బాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సీఎండీ వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపీ అర్వింద్‌కు ప్రముఖుల జన్మదిన శుభాకాంక్షలు

సుభాష్‌నగర్ : నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి జన్మదినం సందర్భంగా ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్వింద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపు టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక

ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 27న జిల్లా సబ్ జూనియర్ టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రవిగౌడ్, మల్లేష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆర్గనైజింగ్ కార్యదర్శి భూపతికి వివరాలను అందించాలన్నారు. 2010 ఏప్రిల్ ఒకటి తర్వాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 9502113860 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మళ్లీ నిరాశే..!

రుణమాఫీ కోసం ఎన్నో ఆశలతో ఎదురు చూసిన అన్నదాతలకు నిరాశే ఎదురైంది. మాఫీ అయితే అప్పు తీరుతుందని భావించిన వారి ఆశలు అడియాసలు అయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో మాఫీకి నోచుకోని ఎందరో ఈ సారి మాఫీ అవుతుందని ఎదురుచూశారు. అర్హత ఉన్నా తీరా జాబితాలో తమ పేరు లేకపోవడంతో కలవరపడుతున్నారు. అప్పుడు.. ఇప్పుడు ఎందుకు మాఫీ కాలేదో తెలియక అయోమయానికి గురి అవుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.



- రుణమాఫీకి నోచుకోని పలువురు రైతులు
- నిధుల కొరతతో ఓసారి..
- సాంకేతిక కారణాలతో మరోసారి దూరం
- అధికారుల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు

వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామానికి చెందిన మహిళా రైతు దేగాం మల్లుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.1.50 లక్షల వరకు పంట రుణం ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన రుణమాఫీ అర్హుల జాబితాలో ఆమె పేరు ఉంది. అయితే, నిధుల విడుదల ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఆమె రుణమాఫీకి నోచుకోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయగా ఆ మహిళా రైతుకు రేషన్ కార్డు లేకపోవడంతో కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉందని రిమార్క్ కాలంలో కనిపిస్తోంది.

మోర్తాడ్‌కు చెందిన మరో రైతు ఎం. రమేశ్ రామన్నపేట్ దక్కన్ గ్రామీణ బ్యాంకులో పంట రుణం తీసుకున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి రుణమాఫీ జాబితాలో ఆయన పేరున్నా రుణం మాఫీ కాలేదు. ప్రస్తుతం రుణమాఫీ జాబితాలో అతడి పేరే కనిపించడం లేదు.

మోర్తాడ్(బాల్కొండ) : జిల్లాలో ఎంతోమంది రైతులు రుణమాఫీకి నోచుకోలేదు. అర్హత ఉన్నా జాబితాలో తమ పేరు లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 ఎన్నికల ముందు రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేసింది. ఆ సమయంలో జిల్లాలో చాలా మంది రైతులకు నిధులు జమ కాలేదు. ఎన్నికల సమయంలో రూ.రెండు లక్షలలోపు రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పడం.. ప్రభుత్వం ఏర్పడ్డాక అందుకు అనుగుణంగానే చర్యలు చేపట్టడంతో అప్పుడు మాఫీ కానీ అన్నదాతలు ఎంతో ఆశతో ఎదురు చూశారు. తీరా మాఫీ జాబితాల్లో తమ పేరు లేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. అప్పుడు.. ఇప్పుడు తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మాఫీ కోసం అధికారులు, బ్యాంకుల చుట్టూ నిత్యం తిరుగుతున్నారు. సాంకేతిక కారణాలను సరి చేసి ప్రభుత్వం తమకు మాఫీ చేయాలని వేడుకుంటున్నారు.

ప్రస్తుత పరిస్థితి..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు విడతల్లో పంటరుణాలను మాఫీ చేసింది. జిల్లాలో 83,061 మంది రైతులకు రూ.626.49 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీకాగా, అనేక మంది రైతుల ఖాతాల్లో ఇప్పటికీ సొమ్ము జమ కావడం లేదు. రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడం, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో పేర్లు లేదా అక్షరాలు వేర్వేరుగా ఉండటం తదితర కారణాల వల్ల అనేక మంది రైతులకు లబ్ధి చేకూరడం లేదు.

2023లో రుణ మాఫీ ఇలా..


జిల్లాలో 2,91,188 రైతులకు రూ.1,790 కోట్ల రుణమాఫీని లక్ష్యంగా నిర్ణయించారు. కాగా 97,418 మంది రైతులకు రూ.490.72 కోట్లు మాత్రమే మాఫీ చేశారు. ఈ లెక్కన 1,93,770 రైతులకు ఇంకా రూ.1,299.28 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడంతో అనేక మంది రైతులకు నిరాశే మిగిలింది.

ఆందోళన చెందొద్దు

రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందొద్దు. రుణమాఫీ వర్తించని రైతుల నుంచి మండల వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. త్వరలోనే అధికారులు రైతుల ఇళ్లకు వచ్చి వివరాలను నమోదు చేసుకుంటారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందిస్తాం.

– మల్లయ్య, ఏడీఏ, భీమ్‌గల్

నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి



కంఠేశ్వర్‌లోని మురళీకృష్ణ ఆలయం



నిజామాబాద్ రూరల్ : శ్రీకృష్ణ జన్మాష్టమిని జిల్లాలో ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకోనున్నారు. కన్నయ్య పుట్టిన రోజు సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ రోజు మధుసూదనుడికి ప్రీతికరమైన అటుకులు, బెల్లం, వెన్న, దోసకాయలు, వంటి వాటితో 108 రకాలతో నైవేద్యాలు పెడతారు. ప్రతి ఇంటి తల్లుల తమ పిల్లలకు చిన్ని కృష్ణుడు, గోపికా వేషంలో అలంకరించి మురిసిపోతారు. పలు ప్రాంతాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు చేపడుతారు. యువత ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొడతారు. జన్మాష్టమి వేడుకలకు నగరంలోని ఆర్మూర్ రోడ్డులో గల మురళీకృష్ణ ఆలయం, శివాజీ నగర్ శ్రీకృష్ణ ఆలయం, గీత భవన్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాల్లో పూజలతో పాటు ఉయ్యాల సేవలను నిర్వహించనున్నారు.

మున్సిపాలిటీ కల నెరవేరేనా?

- నందిపేట్‌ను బల్దియా చేయాలని గతంలో ప్రతిపాదనలు
- తర్వాత పట్టించుకోని వైనం
- ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలంటున్న గ్రామస్తులు

నందిపేట్ : నందిపేట్ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఎన్నో ఏళ్ల కల నందిపేట గ్రామాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం. నందిపేట్‌ను మున్సిపాలిటీ చేయాలని కోరుతూ ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలతో ముంచెత్తినా.. పోరాటాలు చేసిన ప్రభుత్వం మాత్రం కరుణించడం లేదు. వీరి కల కలగానే మిగిలిపోతుంది. బీఆర్ఎస్ హయాంలో నందిపేట్‌ను మున్సిపాలిటీ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని మండల రెవెన్యూ అధికారులను కోరింది. నందిపేట్ మున్సిపాలిటీలో చేరేందుకు ఏ గ్రామాలు ముందుకు వస్తాయో ఆ గ్రామం నుంచి తమకు ఎలాంటి అభ్యంతరాలు లేదని తీర్మానం చేసి రెవెన్యూ అధికారులకు ఇవ్వాలని కోరింది. నందిపేట్ చుట్టు పక్కల గ్రామాలైన బజార్ కొత్తూర్, జోర్పూర్, శాపూర్, లక్కంపల్లి, చింరాజ్‌పల్లి గ్రామాల నుంచి తీర్మానాలు కోరారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాకు అభ్యంతరం లేదని మున్సిపాలిటీలో చేరుతామని తీర్మానం ఇవ్వాలని అప్పటి తహసీల్దార్ కోరారు.

మున్సిపాలిటీగా మారితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని భావించిన ఆయా గ్రామాల ప్రజలు ముందుకు వచ్చారు. కానీ తీర్మానాలు చేయకముందే అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో మున్సిపాలిటీ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ప్రభుత్వం ఇటీవల ములుగును మున్సిపాలిటీగా ప్రకటించింది. దీంతో నందిపేట్‌కు అవకాశం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



నందిపేట్ ప్రధాన కూడలిలో గల నంది విగ్రహం

అభివృద్ధి చెందుతుంది



నందిపేట్ మున్సిపాలిటీగా మారితే గ్రామం అభివృద్ధి చెందుతుంది. మౌలిక వసతులు పెరుగుతాయి. ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు పరిష్కరించడం లేదు. నందిపేట్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు నాయకులు కలిసికట్టుగా ప్రయత్నం చేయాలి.

– అరుట్ల రమేశ్, నందిపేట్

మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలి



నందిపేట్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలి. మున్సిపాలిటీకి కావాల్సిన అన్ని అర్హతలున్నప్పటికీ ఇప్పటి వరకు చేయడం లేదు. గత కొన్నేళ్ల నుంచి మున్సిపాలిటీ అవుతుందని వినడం తప్ప ఆచరణలో మాత్రం కనబడడం లేదు.

– కరెంట్ రాములు, నందిపేట్

సీజనల్ వ్యాధులపై రేపు 'సాక్షి' ఫోన్‌ఇన్



తిరుపతిరావు, జనరల్ ఫిజీషియన్

జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో డెంగీ, చికున్ గున్యా, మలేరియా లాంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆయా వ్యాధులతో వచ్చే సమస్యలపై వైద్య సలహాలు, సూచనలు, అవగాహన కోసం జనరల్ ఫిజీషియన్ తిరుపతిరావుతో మంగళవారం 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. ఆయా సమస్యలపై కింది నంబర్‌కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

తేది : 27-08-2024 (మంగళవారం)
సమయం: ఉదయం 11:00 నుంచి 12:00 గంటల వరకు.

ఫోన్ చేయాల్సిన నంబర్ :
89780 36828

వీవీల కోసం కసరత్తు!

- వివరాలు సేకరిస్తున్న విద్యాశాఖ
- జిల్లాలో 600 మంది విద్యా వలంటీర్లను నియమించే అవకాశం
- ప్రభుత్వ పాఠశాలల్లో తీరనున్న ఉపాధ్యాయుల కొరత



నిజామాబాద్ అర్బన్ : ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బంది పడుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోస్టులు భర్తీ చేసే వరకు విద్యార్థులు నష్టపోకుండా వీవీలతో సర్దుబాటు చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరతను అధిగమించేందుకు జిల్లా విద్యాశాఖ విద్యావలంటీర్లను నియమించే ప్రక్రియపై కసరత్తు చేస్తోంది. ఇటీవల రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ విద్యావలంటీర్ల నియామకానికి సంబంధించి నివేదికను రూపొందించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో ఏ ఏ పాఠశాలల్లో టీచర్ల కొరత తీవ్రంగా ఉంది, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది అనే అంశాలతో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. మరికొన్ని రోజుల్లోనే పూర్తిస్థాయి నివేదికను అందజేయనున్నారు. జిల్లాలో 230 ఉన్నత పాఠశాలలు, 116 ప్రాథమికోన్నత పాఠశాలలు, 693 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 89,764 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో దాదాపు 600 మంది వలంటీర్లను నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

త్వరలో నివేదిక

రాష్ట్ర విద్యాశాఖ నూతన డీఎస్సీ ప్రక్రియను వేగంగా పూర్తిచేసి కొత్త టీచర్లను అందుబాటులోకి తీసుకు రావాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అనుగుణంగా డీఎస్సీ పరీక్షలను కూడా నిర్వహించింది. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ అమలు, డీఎస్సీ నూతన నియామక ప్రక్రియ ఆలస్యం కావడంతో విద్యావలంటీర్ల నియామకంపై దృష్టి సారించింది. దీంతో ఆయా జిల్లాలకు వీవీల ఏర్పాటుకు సంబంధించి వివరాలను ఇవ్వాలని ఆదేశించింది. జిల్లాలో పది రోజులుగా జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య దానికి అనుగుణంగా టీచర్లు ఎంత మంది ఉన్నారు, సబ్జెక్టుల వారిగా వివరాలను సేకరిస్తున్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో పరిస్థితులపై నివేదిక రూపొందిస్తున్నారు. ఇటీవల జిల్లా విద్యాశాఖలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. దీంతో చాలా పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా టీచర్లు అందుబాటులోకి రాలేదు. కొందరు టీచర్లు పదోన్నతులు, సబ్జెక్టుల వారిగా బదిలీలు ఎంచుకోవడంలో ఒక్కొక్కరు మూడు నుంచి నాలుగు ప్రాంతాల్లో కేటాయింపబడ్డారు. ప్రస్తుతం మాత్రం ఒకే ప్రాంతంలో కొనసాగుతున్నారు. మిగతా ప్రాంతాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఇలా జిల్లాలో 450కి పైగా ఖాళీలు ఏర్పడ్డాయి. అంతేకాకుండా పదోన్నతులు చేపట్టడంతో ఖాళీలు అయ్యాయి. ఇలా రెండు విధానాలతో 700 వరకు ఖాళీలు ఏర్పడ్డాయి. వీరి స్థానాల్లో తాత్కాలికంగా విద్యా వలంటీర్లను నియమించాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం

జిల్లాలో విద్యా వలంటీర్ల నియామకానికి సంబంధించి ఉన్నతాధికారులు వివరాలు అడిగారు. ప్రతి పాఠశాల నుంచి వివరాలు సేకరిస్తున్నాం. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

– దుర్గాప్రసాద్, డీఈవో



పంట రక్షణకు భలే ఐడియా..

మాక్లూర్ మండలం గుత్ప శివారులో ఆర్మూర్‌కు చెందిన రైతు జయప్రకాశ్ తన పొలంలోకి పక్షులు రాకుండా నిరంతరం శబ్దం వచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ రైతు ఒక ఎకరం పొలంలో జామ, నిమ్మ చెట్లతో పాటు అంతరపంటగా టమాట, ఇతర కూరగాయలు సాగు చేస్తున్నాడు. పక్షుల బెడదను నివారించేందుకు గాను జయప్రకాశ్ పొలంలో వరుసల వారీగా 100 చోట్ల కర్రలను పాతి, వాటికి రేకుడబ్బాలు తగిలించి, వెనుక భాగంలో గాలివాటానికి తిరిగేలా ఫ్యాన్లు బిగించాడు. మధ్యలో సైకిల్ పుల్ల ఏర్పాటు చేశాడు. గాలికి ఫ్యాన్ తిరిగినప్పుడు సైకిల్ పుల్ల డబ్బాకు తగిలి శబ్దం వస్తోంది. రైతు అనుసరిస్తున్న ఈ శబ్దోపాయం భలేగా ఉందని చూసినవారందరూ అంటున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

రుణం లేనిదే సాగని పయనం!

- ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుల్లో డిపాజిట్లకన్నా అప్పులే అధికం
- ఎస్ఎల్‌బీసీ గణాంకాల ద్వారా వెల్లడి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జీవన గమనంలో ప్రతి కుటుంబం తమ అవసరాల కోసం అప్పులు చేయడం సహజం. తక్కువ వడ్డీ వసూలు చేసే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడానికే ప్రాధాన్యతనిస్తారు. ముఖ్యంగా రైతులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల నుంచి రుణాలు పొందుతారు. నిరుద్యోగ యువత కూడా రుణాలు తీసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్నవారే ఎక్కువగా ఉంటారు.

వివిధ అవసరాలకోసం..

ఉమ్మడి జిల్లాలో బ్యాంకుల్లో డిపాజిట్లకన్నా అప్పులు ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 31 నాటి ఎస్ఎల్‌బీసీ(స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ) గణాంకాలకు సంబంధించి క్రెడిట్ డిపాజిట్ (సీడీ) వివరాల ప్రకారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో డిపాజిట్లకన్నా రెట్టింపు సంఖ్యలో రుణాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో డిపాజిట్ల కన్నా అప్పులు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. అదే సెమీ అర్బన్, అర్బన్ ప్రాంతాల్లో కొంత తేడా కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పంటల సాగు కోసం అప్పులు తీసుకోవడం మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు అప్పులు డిపాజిట్ల కన్నా ఎక్కువగా ఉంటున్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళలకు విరివిగా అందుతున్న రుణాలతో వారు ఆర్థికాభివృద్ధి సాధించే దిశలో ముందుకు నడుస్తున్నారు. బ్యాంకు రుణాల్లో వ్యవసాయం తర్వాత స్వయం సహాయక సంఘాలు తీసుకున్నవే ఎక్కువగా ఉంటున్నాయి. పట్టణాలు, నగరాల్లో వ్యాపార వర్గాలు, పారిశ్రామిక వేత్తలు ఎక్కువగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నారు. గృహ రుణాలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగులు, ఇతర వర్గాల వారు సొంత ఇంటి నిర్మాణాలకు హౌజింగ్ లోన్లు తీసుకుంటున్నారు.

కామారెడ్డి జిల్లాలో...

జిల్లాలో అన్ని బ్యాంకులకు కలిపి 138 శాఖలు ఉన్నాయి. ఆయా బ్యాంకుల్లో గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1,261.04 కోట్ల డిపాజిట్లు ఉండగా.. రూ. 2,831.08 కోట్ల అప్పులున్నాయి. సెమీ అర్బన్ ప్రాంతాల్లో రూ. 2,507.04 కోట్ల డిపాజిట్లు ఉండగా.. రూ. 4,238.65 కోట్ల అప్పులున్నాయి. అర్బన్‌కు సంబంధించి రూ. 10.86 కోట్ల డిపాజిట్లు ఉంటే, రూ. 99.70 కోట్ల అప్పులు ఉన్నాయి. మొత్తంగా కామారెడ్డి జిల్లాలో రూ. 3,778.94 కోట్ల డిపాజిట్లు ఉండగా, రూ. 7,168.83 కోట్ల అప్పులు ఉన్నట్లు ఎస్ఎల్‌బీసీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో క్రెడిట్, డిపాజిట్ (సీడీ) రేషియో 189.70 శాతంగా నమోదయ్యింది.

నిజామాబాద్ జిల్లాలో..

జిల్లాలో 283 బ్యాంకు శాఖలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 2,887.69 కోట్ల డిపాజిట్లు ఉండగా.. రూ. 6,303.87 కోట్ల అప్పులున్నాయి. సెమీ అర్బన్ ప్రాంతాల్లో రూ. 2,187.19 కోట్ల డిపాజిట్లు ఉండగా.. రూ. 4,127.00 కోట్ల అప్పులు, అర్బన్ ప్రాంతాల్లో రూ. 4,915.52 కోట్ల డిపాజిట్లు ఉంటే.. రూ. 7,541.96 కోట్ల అప్పులు ఉన్నాయి. మొత్తంగా రూ. 9,990.40 కోట్ల డిపాజిట్లు, రూ. 17,972.83 కోట్ల అప్పులున్నట్లు స్పష్టమవుతోంది. క్రెడిట్, డిపాజిట్ (సీడీ) రేషియో 179.90 శాతంగా ఉంది.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


రవళి

బాల్కొండ: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రవళి అండర్–16 విభాగంలో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రినిపాల్ శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 1 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

రక్తనమూనాలు సేకరించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని భూంపల్లి గ్రామాన్ని ఆదివారం జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో విష జ్వరాలతో ఇద్దరు చిన్నారులు మరణించిన విషయం విధితమే. దీంతో గ్రామంలోని అన్ని వీధులను పరిశీలించి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో వెంటనే చెత్తను, పిచ్చి గడ్డిని తొలగించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి రక్త నమూనాలను సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, వైద్యాధికారి ఆస్మా తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల పరిశీలన



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మోడల్ డిగ్రీ కళాశాలను ఎన్‌సీసీ యూనిట్ అధికారుల బృందం ఆదివారం పరిశీలించారు. ఎల్లారెడ్డి మోడల్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకుగాను కళాశాల బృందం దరఖాస్తు చేసుకోవడంతో కళాశాల ఆవరణను 7వ బెటాలియన్‌కు సంబంధించిన ఎన్‌సీసీ అధికారుల బృందం సుబేదార్లు హరిప్రీత్‌సింగ్, రచ్‌పాల్‌సింగ్, బాబు పరిశీలించారు. కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకు అధికారులు అనుకూలంగా స్పందించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు కేపీ, సిద్దురాజ్ తదితరులున్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట మండల ఎస్సైగా అరుణ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లా కేంద్రం కామారెడ్డి వీఆర్ నుంచి బదిలీపై లింగంపేటకు వచ్చారు. లింగంపేటలో పనిచేసిన ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి బదిలీపై చేగుంటకు వెళ్లారు.

మటన్ కర్రీలో బొద్దింక


హోటల్ యజమానికి అధికారులు జరిమానా విధించిన రసీదు

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో భోజనం చేస్తున్న ఓ వ్యక్తికి ఆహారంలో బొద్దింక వచ్చింది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఉన్న సాయి మోక్ష హోటల్‌లో ఓ వ్యక్తి మటన్ కర్రీతో భోజనం చేసేందుకు వచ్చాడు. తీరా హోటల్ సిబ్బందికి తీసుకొచ్చిన భోజనంలో బొద్దింక వచ్చి షాక్‌కు గురయ్యాడు. ఇదేంటని ప్రశ్నించగా హోటల్ యజమాని నిర్లక్ష్యపు సమాధానం చెప్పడంతో బాధితుడు వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. స్పందించిన కమిషనర్ హోటల్‌కు వచ్చి తనిఖీలు చేశారు. మటన్‌కర్రీలో బొద్దింక వచ్చినట్లు గుర్తించి హోటల్ యజమానికి నోటీసులు జారీ చేసి రూ.5 వేల జరిమానా విధించారు. కిచెన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలు నాణ్యమైనవి ఉండాలని హెచ్చరించారు.

పనిచేయని నిఘానేత్రాలు

- మరమ్మతులకు నోచుకోని సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు

రెంజల్: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పోలీసు ఉన్నతాధికారులు చెబుతుంటారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నా.. వాటి నిర్వహణ బాధ్యతను మరుస్తున్నారు. జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు బోధన్ డివిజన్‌లో స్థానిక పోలీసులు ప్రత్యేక శ్రద్ధతో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటులో సఫలీకృతులయ్యారు. స్థానిక నాయకులు, అభివృద్ధి కమిటీల సహకారంతో గ్రామాల్లో సీసీ కెమెరాలను ఉత్సాహంగా ప్రారంభించారు. గత సీపీ నాగరాజు సాటాపూర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ప్రస్తుతం మండలంలో సీసీ కెమెరాల ద్వారా నిఘా సన్నగిల్లుతోంది. సీసీ కెమెరాల నిర్వహణ లేకపోవడంతో నిద్దురోతున్నాయి. దీంతో డివిజన్ పరిధిలో ఇటీవల దొంగతనాలు హెచ్చుమీరుతున్నాయి.


రెంజల్‌లో దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్(ఫైల్)

ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్‌గా..

దొంగలు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని విలువైన కాపర్ వైర్లు, ఆయిల్‌ను ఎత్తుకెళ్తున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుంది. దొంగలు వాటిని ధ్వంసం చేయడంతో మిగిలిన భాగాలను ట్రాన్స్‌కో అధికారులు తీసుకుని కిలోల లెక్కన అమ్ముకోవాల్సి వస్తోంది. సీసీ కెమెరాల నిర్వహణలో లేక ఇటీవల రెంజల్‌లో 5, దూపల్లిలో 3, నీలాలో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ధ్వంసం చేశారు. అంతకు ముందు తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన 9 మంది రైతులకు చెందిన సబ్‌మెర్సిబుల్ ఓపన్‌వెల్ ఇంజిన్‌లను దొంగిలించారు. బోధన్ పోలీస్ సర్కిల్ పరిధిలోని మండలాల్లో నిత్యం ఏదో ఒక గ్రామంలో దొంగతనం జరుగుతోంది. దీంతో పాటు రైతులు పంట పొలాలకు దారి లేక ఎరువులను రోడ్లపై నిల్వ చేసుకుని మర్నాడు కూలీలతో చల్లించుకుంటున్నారు. దొంగలు నిల్వ చేసుకుంటున్న బస్తాలను సైతం తస్కరిస్తున్నారు. ఇటీవల వీరన్నగుట్ట గ్రామంలో రోడ్లపై నిద్రిస్తున్న రామాలయానికి చెందిన ఆవులు, దూడలను ఎత్తుకెళ్లారు.


సాటాపూర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీపీ నాగరాజు (ఫైల్)

కేసుల నమోదుకే పరిమితం

రైతులు, ట్రాన్స్‌కో అధికారులు అందించిన ఫిర్యాదులతో పోలీసులు కేసుల నమోదుకు పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దొంగతనాల నివారణకు తీసుకున్న చర్యలు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంతో రైతులు, ట్రాన్స్‌కో తీవ్రంగా నష్టపోతున్నా నివారణ చర్యలు తీసుకోవడంలో పోలీసు యంత్రాంగం స్పందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. బందోబస్తును ముమ్మరం చేసి నిఘా నేత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పట్టుకుంటాం

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను త్వరలో పట్టుకుంటాం. నిఘాను ముమ్మరం చేశాం. ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనం జరుగకుండా ట్రాన్స్‌కో సిబ్బందిని సమన్వయం చేసుకుని ట్రాన్స్‌ఫార్మర్లకు నట్ల స్థానంలో వెల్డింగ్ చేయిస్తున్నాము.

– సాయన్న, ఎస్సై

ట్రాన్స్‌కోకు తీవ్రనష్టం

ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుంది. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున రైతులకు బోర్ల వినియోగం తగ్గింది. లేదంటే పరిస్థితి మరోలా ఉండేది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రాజలింగం, విద్యుత్ శాఖ అధికారి




మొక్క చెప్పిన పాఠం

సృష్టిలో ఎండా కాలం.. వర్షాకాలం ఎలాగైతే ఒకదాని తర్వాత మరొకటి మారుతూ ఉంటాయో అలాగే జీవితంలోనూ కష్టాల వెంట సుఖాలు ఉంటాయి. కానీ కష్టాలు వచ్చినప్పుడు మాత్రం కొందరు భయపడుతుంటారు. వచ్చిన కొద్దిపాటి కష్టానికి జీవితం ఇంతే అంటూ ఆత్మహత్య చేసుకుంటూ తమ నిండు ప్రాణాలను బలి చేసుకుంటుంటారు. ఈ ప్రకృతిలో ఎండ తగలకుండా పెరిగిన చెట్టు లేదు.. కష్టం లేకుండా ఎదిగిన మనిషి లేడు. పడిన చోటే నిలిచి మన సత్తా ఏంటో చూయించాలంటోంది ఈ చిత్రంలో ఎదిగిన ఓ మొక్క. జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మినగర్ రోడ్ నంబర్–3లో ఓ కుటుంబం తిని కవర్‌లో పారేసిన మామిడి పీసు(టెంక) స్థానికంగా ఉన్న కేబుల్ వైర్లకు తట్టుకుంది. అందులో ఉన్న పీసు ఎండకు ఎండుతూ వానకు తడిచి ఇలా మొలకెత్తింది. పడిన చోటే ఇలా లేవాలని ఈ మొక్కను చూసిన వారందరూ చర్చించుకుంటున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మూడో కల్లుడిపో అక్రమాలపై చర్చకు సిద్ధమా..

- గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ఖలీల్‌వాడి: నగరంలోని భవానీ గీతా పారిశ్రామిక సహకార సంఘం సొసైటీ–3 లో జరుగుతున్న అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ సవాల్ విసిరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మూడో కల్లుడిపోకు చెందిన గౌడ సభ్యులతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. కల్లు సొసైటీలో గీతా కార్మికుల పొట్ట కొట్టి సంఘం బైలాను తుంగలో తొక్కేసిన స్వామి గౌడ్ రూ. కోట్ల ఆస్తులు సంపాదించారని, హైదరాబాద్‌లో రూ.4 కోట్ల విల్లా, జిల్లా కేంద్రంలో రూ. కోటితో ఇల్లు, మూడు కార్లు ఎలా కొనుగోలు చేశారని ఆరోపించారు. డిపో యజమానులుగా చలామణి అవుతున్న సుమన్‌గౌడ్, జయసింహాగౌడ్ రూ. కోట్లు ఎక్కడి నుంచి సంపాదించారని ప్రశ్నించారు. ఈ ముగ్గురు ప్రతి నెలా డిపో నుంచి రూ. 2 లక్షల వేతనం తీసుకుంటూ కార్మికులకు మాత్రం కేవలం రూ.4 వేలు, సభ్యులకు రూ.వెయ్యి అందిస్తున్నారని తెలిపారు. సొసైటీ బైలా ప్రకారం వచ్చిన లాభాలను 15 శాతం వాటాను కార్మికులకు పంచాలి, అలాగే 25 శాతం లాభాలను కార్మికుల సంక్షేమం కోసం ఉపయోగించాలి కానీ వాస్తవంగా సొసైటీలో అలా జరగడం లేదన్నారు. భీంగల్ మండలంలోని గోన్‌గొప్పులలో ఉపాధి హామీ పథకంలో స్వామిగౌడ్, జయసింహాగౌడ్, సుమన్‌గౌడ్ తోపాటు కుటుంబ సభ్యుల పేర్లు ఉన్నాయని చెప్పారు. ఈ ముగ్గురు స్థానికేతరులని వీరికి మూడో కల్లుడిపోలో సభ్యులుగా ఎలా ఉంటారని ప్రశ్నించారు. సంబంధిత అధికారులకు సైతం ఫిర్యాదు చేస్తే చర్యలు శూన్యమని పేర్కొన్నారు. కల్లు డిపోలో ఆధార్‌కార్డుల మార్ఫింగ్‌పై కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మూడో డిపో కోసం పోరాడిన అరుణకు డైరెక్టర్‌గా ఇప్పటికీ అవకాశం ఇవ్వలేదన్నారు. స్వామిగౌడ్ తోపాటు పలువురి ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు రాజగోపాల్ గౌడ్, సిరిగాధ స్వామిగౌడ్, బాబా గౌడ్, అశోక్ రాజ్‌గౌడ్, అఖిల్‌గౌడ్, రాజ్ కుమార్ గౌడ్, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పలుచోట్ల ఆకస్మిక తనిఖీ


నిరాశ్రయులతో మాట్లాడుతున్న కమిషనర్


అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నిజామాబాద్‌అర్బన్/ఖలీల్‌వాడి: నగరంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మున్సిపల్ కమిషనర్ మకరంద్ ఆకస్మికంగా పర్యటించారు. ఉదయం నాగారంలోని రాజారాం స్టేడియాన్ని సందర్శించారు. అక్కడ వాకర్స్‌తో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాజారాం స్టేడియం గ్రౌండ్‌ను పరిశీలించారు. అనంతరం రామర్తి చెరువు రెండో సర్కిల్ పరిధిలో తనిఖీలు చేపట్టారు. పాత కలెక్టరేట్ పక్కన ఉన్న కుక్కల కుటుంబ నియంత్రణ విభాగాన్ని పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని, సమయ పాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. చెత్తసేకరించే వాహనాలను పరిశీలించి వాటి వివరాలు తెలుసుకున్నారు.

నిరాశ్రయులకు ప్రత్యేక కేంద్రాలు

నగరంలోని నిరాశ్రయులకు మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ మకరంద్ అన్నారు. శనివారం అర్ధరాత్రి రైల్వేస్టేషన్‌లోని నిరాశ్రయులతో కమిషనర్ మాట్లాడారు. నిరాశ్రయుల కేంద్రంపై అవగాహన కల్పించారు. అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించామని, ప్రతి ఒక్కరు అక్కడే ఉండాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణలు ఉన్నారు.

చెట్ల తొలగింపుతో ట్రాఫిక్‌కు అంతరాయం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణ శివారులో నేషనల్ హైవే పనులలో భాగంగా చెట్ల తొలగింపుతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి–మెదక్ రహదారిలో పెద్ద పెద్ద చెట్ల తొలగింపుతో ట్రాఫిక్ నిలిచి పోతున్నదని ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలను తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కామారెడ్డిటౌన్: జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ హనుమాన్ మందిర్ స్కూల్‌లో 1990–91కు చెందిన మొదటి బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి మిత్రులందరూ ఒకే చోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నువ్వులు.. మాయమైన నువ్వులు

- ఇతర దేశాల నుంచి దిగుమతులు.. ఆందోళన చెందుతున్న రైతులు
- మంచి ధర వస్తుందని నిలువ చేసుకున్న వారికి నిరాశే
- ఒకే సారి క్వింటాలుకు రూ.6,500 పడిపోయిన ధర


మోర్తాడ్‌లో సాగు చేసిన నువ్వుల పంట(ఫైల్)

మోర్తాడ్: నువ్వులు.. నూనె గింజల పంటల్లో ప్రధానమైనది. నువ్వుల పంటతో అధిక లాభం ఆర్జించాలనుకునే రైతులకు ఈ సారి నిరాశే ఎదురైంది. పాకిస్తాన్, బ్రెజిల్ దేశాలు తక్కువ ధరకే మన దేశానికి నువ్వులు విక్రయిస్తుండటంతో స్థానికంగా సాగు చేసిన పంటకు ధర దక్కక రైతులు అయోమయానికి గురవుతున్నారు. యాసంగిలో సాగు చేసిన నువ్వులను ఎక్కువ ధరకు విక్రయించాలని నిలువ చేసుకున్న రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది. ఓ దశలో నువ్వుల పంటకు క్వింటాలు రూ.20వేల ధర పలికింది. ఇతర పంటల సాగుతో కలిగిన నష్టాన్ని నువ్వుల పంటతో బయటపడవచ్చని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. గడిచిన యాసంగిలో జిల్లాలో దాదాపు 3వేల ఎకరాల్లో నువ్వుల పంటను రైతులు సాగు చేశారు. గతంలో క్వింటాలుకు రూ.10వేల నుంచి రూ.12వేల వరకు ధర పలుకగా ఈ సారి ఏకంగా రూ.8వేల వరకు పెరగడంతో అనేక మంది రైతులు నువ్వుల సాగుకు మొగ్గచూపారు. నువ్వులను కొనుగోలు చేసే వ్యాపారులు డిమాండ్‌ను బట్టి క్వింటాలుకు రూ.17,500ల వరకు కొనుగోలు చేశారు. సీజన్ కాని సమయంలో ఈ ధర రూ.20వేలకు చేరుతుందనే ఉద్దేశంతో కొందరు భారీగా నువ్వులను నిలువ చేశారు. ఒక్క కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన రైతులే దాదాపు వెయ్యి క్వింటాళ్ల నువ్వులను నిలువ చేశారు. అలాగే మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్, మోర్తాడ్, వేల్పూర్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో మరో 2,500 క్వింటాళ్ల నువ్వులు నిలువ ఉన్నట్లు సమాచారం. స్థానిక వ్యాపారులు ఇక్కడి రైతుల నుంచి నువ్వులను సేకరించి గుజరాత్‌లోని అంతర్జాతీయ మార్కెట్‌కు వీటిని తరలిస్తారు. పాకిస్తాన్ దేశం ఆర్థికంగా చితికిపోవడంతో తమ వద్ద ఉన్న నువ్వులకు ధర తగ్గించింది. రవాణా చార్జీలు కలుపుకొని క్వింటాలు నువ్వులను రూ.11వేలకే విక్రయించింది. అదే మార్గంలో బ్రెజిల్ దేశం కూడా వ్యవహరించడంతో ఇక్కడి నువ్వులకు డిమాండ్ లేకుండా పోయింది. ఓ దశలో రూ.17,500లు పలికిన ధర ఏకంగా రూ.6వేలకు పడిపోవడంతో రైతులు మనో వేదనకు గురయ్యారు. దీంతో కొందరు రైతులు పంటను అమ్ముకోలేక నిలువ చేసుకుంటున్నారు.

ధర లేక అమ్మలేదు



ఈ ఏడాది నువ్వులకు ఆశించిన ధర లేక విక్రయించలేదు. తక్కువ ధరకు విక్రయిస్తే లాభం తగ్గడమే కాకుండా శ్రమకు తగిన ఫలితం లేకుండా పోతుంది. ఏకంగా రూ.6వేలకు మించి ధర తగ్గిపోవడంతో నిలువ చేసుకుంటున్నాం.

– రొక్కం మురళి, రైతు, తిమ్మాపూర్

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: చేసిన అప్పు చెల్లించలేక మనస్తాపం చెందిన ఒకరు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌కు చెందిన బూక్య ప్రశాంత్ (26) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి ఏడాది క్రితం వివాహమైంది. అవసరాల నిమిత్తం తన భార్యకు సంబంధించిన రెండు తులాల బంగారం గొలుసును ఓ బ్యాంక్‌లో తాకట్టుపెట్టి రూ.70 వేలు రుణం తీసుకున్నాడు. వాయిదాలు సకాలంలో చెల్లించకపోవడంతో తరచుగా బ్యాంక్ నుంచి ఫోన్‌లు వస్తున్నాయి. దీంతో మనస్తాపం చెందిన అతడు ఓ గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన స్థలాన్ని కామారెడ్డి రైల్వే ఎస్సై తావూనాయక్ పరిశీలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో మరొకరు..

ఎల్లారెడ్డి: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని భిక్కనూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డెపల్లి రవి(35)కి కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులోని శ్మశాన వాటికలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అడవి పందులను తరలిస్తున్న వాహనం పట్టివేత


స్వాధీనం చేసుకున్న వాహనంతో అధికారులు

నందిపేట్: మండలంలోని అయిలాపూర్ శివారు నుంచి అక్రమంగా అడవి పందులను తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉన్నతాధికారుల సమాచారం మేరకు అయిలపూర్ శివారులో బొలేరో వాహన్నాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాహనంలో ఉన్న నాలుగు అడవి పందులు, వేటాడడానికి ఉపయోగించే జీఐ వైరు, వల, తాళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా డ్రైవర్‌తో పాటు ముగ్గురు వ్యక్తులు పరారైనట్లు పేర్కొన్నారు. పట్టుకున్న అడవి పందులను సమీప రిజర్వు ఫారెస్టులో వదిలి వేస్తామన్నారు. పరారైన నిందితులను త్వరలో పట్టుకుంటామని ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్, ప్రసాద్, పోలీస్ సిబ్బంది ప్రసాద్, రవిరాజ్ పాల్గొన్నారు.

డెంగీతో యువకుడి మృతి


నరేశ్ (ఫైల్)

సదాశివనగర్: మండల కేంద్రంలోని ఓ యువకుడు డెంగీతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చిలుక నరేశ్(29) నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధ పడుతున్నాడు. కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రంలో డెంగీ కేసు నమోదు కావడం ఇది మొదటిది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

భిక్కనూరు: ఆరోగ్యం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యకు యత్నించిన ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన కైరంకొండ లింగం(29)కు ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. ఆయన ఆరోగ్యం బాగు కోసం అప్పులు అయ్యాయి. దీంతో అప్పులను ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురైన లింగం ఈ నెల 5న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే కామారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు ఎల్లారెడ్డిపేటకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లక్ష్మీపూర్ క్యాంప్‌లో చోరీ

- జైలు నుంచి విడుదలై మరో చోరీకి పాల్పడిన నిందితులు
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) జీపీ పరిధిలోని లక్ష్మీపూర్ క్యాంప్‌లో తాళం వేసిన ఇంట్లో ఇద్దరు దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్ క్యాంపునకు చెందిన కమ్మ సత్యనారాయణ కుటుంబ సభ్యులు గత నెల రోజులుగా ఇంటికి తాళం వేసి వర్నిలో తన కుమార్తె వద్ద ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేనిది గమనించిన దుండగులు ఆదివారం తెల్లవారు జామున ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో విలువైన వస్తువుల కోసం గాలిస్తుండగా వచ్చిన శబ్దంతో పక్కింట్లో ఉండే జయబాబు బయటకు వచ్చి చూశాడు. దొంగలను గుర్తించిన ఆయన కేకలు వేయడంతో వారు పారిపోయారు. విషయాన్ని సత్యనారాయణకు చెప్పిన జయబాబు మరో ఇద్దరు శ్రీనివాస్, సురేష్‌తో కలిసి బైక్‌పై వెంబడించారు. పారిపోతున్న దొంగలను అక్బర్‌నగర్ శివారులో పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా చోరీకి పాల్పడింది తగిలేపల్లికి చెందిన ఇనాయక్ అలీ అలియాస్ షేక్ సలీం, అంబం(ఆర్)కు చెందిన దులిగ పోశెట్టిగా గుర్తించారు. వీరు ఇటీవల జైలు నుంచి విడుదలై మరో చోరీకి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో ..



ఖలీల్‌వాడి: నగరంలోని రోటరీనగర్‌లో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన కొమరయ్య కుటుంబీకులతో కలిసి శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లారు. రాత్రి 11 గంటలకు తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడం గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. చోరీలో బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, రూ.25వేల నగదు, వెండిని దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్బాబాదిలో బైక్..

ఖలీల్‌వాడి: నగరంలోని గుర్బాబాది రోడ్డులో ఓ ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన కిరణ్ తన బైక్‌ను ఈనెల 15న రాత్రి తన ఇంటి ఎదుట నిలిపి నిద్రించాడు. ఉదయం లేచి చూసే సరికి కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

బోధన్‌టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని రాకాసీపేట్‌లో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి సీఐ వీరయ్య ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం .. మహారాష్ట్రకు చెందిన అర్మాన్ చండేశ్వర్ తన భార్య, ఏడాదిన్నర బిడ్డతో కలిసి ఉపాధి నిమిత్తం బోధన్‌లోని రాకాసీపేట్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం చండేశ్వర్ భార్య పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.